సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం । 27 । జూన్ । 2025




విధి నిర్వహణలో విగతజీవులై..
తెలంగాణలోని కోదాడ వద్ద ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో ఆలమూరు ఎస్సై అశోక్, ఆత్రేయపురం కానిస్టేబుల్ బ్లెసన్ జీవన్ దుర్మరణం పాలయ్యారు.

8లో



జలపుష్ప విలాసం!
ఉప్పాడ మేజర్ హార్బర్, అమీనాబాద్ సాగరతీరం చేపల క్రయవిక్రయాలతో కళకళలాడాయి. మత్స్యకారులకు సుమారు రూ.90 లక్షల విలువైన చేపలు లభించాయి.

డెల్టాలకు 11 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: ఖరీఫ్ సాగు కోసం కాటన్ బ్యారేజీ నుంచి గురువారం గోదావరి డెల్టా కాలువలకు 11 వేల క్యూసెక్కుల నీరు వదిలారు. దీనిలో తూర్పు డెల్టాకు 3 వేలు, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు చొప్పున విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.25 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

రుడా వైస్ చైర్మన్‌గా జేసీకి అదనపు బాధ్యతలు



రుడా వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) వైస్ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ (జేసీ) ఎస్.చిన్నరాముడు గురువారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ రుడా వైస్ చైర్మన్‌గా పని చేసిన కమిషనర్ కేతన్ గార్గ్ గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జేసీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా.. బాధ్యతలు చేపట్టిన అనంతరం చిన్నరాముడు రుడా చేపట్టిన అభివృద్ధి అంశాలపై సెక్రటరీ ఎంవీఆర్ సాయిబాబా, చీఫ్ ప్లానింగ్ అధికారి జీవీఎస్ఎన్ మూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.నాగేశ్వరి, ఇతర అధికారులతో చర్చించారు.

తల్లీబిడ్డల మృతిపై విచారణకు కలెక్టర్ ఆదేశం

గోపాలపురం: ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యంతో నిండు గర్భిణి, గర్భంలోని బిడ్డ మృతి చెందిన సంఘటనపై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తీవ్రంగా పరిగణించారు. దీనిపై గురువారం విచారణకు ఆదేశించారు. గోపాలపురం మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన వారా లక్ష్మికి నెలలు నిండటంతో కుటుంబ సభ్యులు సీహెచ్‌సీలో చేర్పించారు. అధిక మోతాదులో మత్తు ఇంజక్షన్లు ఇవ్వడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లి తల్లి, బిడ్డ మృతి చెందారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించడంతో రాజమహేంద్రవరం జీజీహెచ్ గైనకాలజిస్ట్ కె.రూబినా, ఎనస్థీషియన్ బి.రాణి, అక్కమాంబ, డాక్టర్ అరుణతో కూడిన బృందం గోపాలపురం సీహెచ్‌సీలో విచారణ చేపట్టారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు.

ఆగస్టులో పలు రైళ్ల రద్దు



రాజమహేంద్రవరం సిటీ: విశాఖపట్నం డివిజన్ దువ్వాడ - తాడి సెక్షన్‌లో ట్రాక్ మరమ్మతుల నిమిత్తం ఆగస్టు 26, 28, 30 తేదీల్లో జిల్లా మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని రెండు నెలల ముందుగానే ఈ విషయం ప్రకటిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం - విశాఖపట్నం (67285), కాకినాడ పోర్ట్ - విశాఖపట్నం (17267), విశాఖపట్నం - కాకినాడ పోర్ట్ (17268), గుంటూరు - విశాఖపట్నం (22876), విశాఖపట్నం - గుంటూరు (22875), విజయవాడ - విశాఖపట్నం (12718), విశాఖపట్నం - విజయవాడ (12717) రైళ్లను ఆ తేదీల్లో రద్దు చేశామని వివరించారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు 186 మంది హాజరు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం సర్టిఫికెట్ల పరిశీలనకు 186 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. శుక్రవారం 1,04,001 నుంచి 1,20,000 వరకు ర్యాంకు కలిగిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు పరిశీలన జరుగుతుందన్నారు. అలాగే 50,001 నుంచి 90 వేల ర్యాంకు వచ్చిన అభ్యర్థులు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చన్నారు.

3 నుంచి రైల్వే గేటు మూసివేత

సామర్లకోట: రైల్వే ట్రాక్‌కు అత్యవసర మరమ్మతులు చేపట్టనున్న దృష్ట్యా కడియం - ద్వారపూడి మధ్య 407 రైల్వే గేటును వచ్చే నెల 3 నుంచి 6వ తేదీ వరకూ మూసివేస్తున్నారు. సామర్లకోట సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రామసుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ మేరకు ద్వారపూడి పోలీసు స్టేషన్, పంచాయతీ కార్యాలయం, కేశవరం పంచాయతీ కార్యాలయం, కేశవరం కోకాకోలా కంపెనీకి, మండపేట రెవెన్యూ అధికారికి, ద్వారపూడి, కేశవరం, లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు, ద్వారపూడి ఆటో అసోసియేషన్‌కు సమాచారం ఇచ్చామని వివరించారు. ఆ రోజుల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలని కోరారు.



చెరువును తలపిస్తున్న యర్నగూడెం - పాంగుటూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు



అధ్వానంగా ఉన్న దేవరపల్లి - బుచ్చియపాలెం రోడ్డు



గోపాలపురం వద్ద ధ్వంసమైన తల్లాడ - దేవరపల్లి జాతీయ రహదారి

● యమపురికి దారుల్లా..

రోడ్డు.. బ్యాడ్..



గోతులమయంగా ఉన్న పెరవలి మండలం కానూరు - నడుపల్లి రోడ్డు

- ధ్వంసమైన రహదారులు
- అడుగడుగునా గుంతలు
- చెరువులను తలపించేలా ఛిద్రం
- బెంబేలెత్తుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని సర్కారు



దేవరపల్లి - దుద్దుకూరు మధ్య గుండుగొలను - కొవ్వూరు ప్రధాన రహదారి దుస్థితి



ఈజీకే రోడ్డు నుంచి లక్ష్మీపురం జెడ్పీ రోడ్డు

దేవరపల్లి/పెరవలి: 'సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి నేతలు చాలా గొప్పగా ప్రకటించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేసేస్తామన్నారు. రోడ్లు అద్భుతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఎక్కడైనా ఒక రోడ్డుకు చిన్నపాటి మరమ్మతులు చేయగానే.. 'అద్దంలా రోడ్లు.. నాడు నరకం - నేడు స్వర్గం అనే రీతిలో 'పచ్చ' మీడియా డప్పేసి చాటింది. సంక్రాంతి వెళ్లిపోయింది.. ఉగాది వెళ్లిపోయింది.. కాలం గడుస్తూనే ఉంది. ఇప్పుడు కూటమి వారి ఏలికలో ఎక్కడ చూసినా గుంతలు పడిన రోడ్లే దర్శనమిస్తున్నాయి. నిలువునా ఛిద్రమై.. అడుగడుగునా గుంతలు పడి.. చిన్నపాటి వర్షాలకే చెరువుల్లా మారిన రోడ్లపై వెళ్తుంటే నడుములు విరిగిపోతున్నాయని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. గ్రామీణ, ఆర్‌అండ్‌బీ, హైవే అనే తేడా లేకుండా జిల్లాలో ఎక్కడ చూసినా రహదారులు దారుణంగా కనిపిస్తున్నాయి.

- నిడదవోలు - పాంగుటూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు యర్నగూడెం - పాంగుటూరు మధ్య పరమ అధ్వానంగా ఉంది. దీనిని 2016-17లో సుమారు రూ.15 కోట్లతో విస్తరించారు. తరువాత జంగారెడ్డిగూడెం నుంచి దేవరపల్లి రోడ్డు పూర్తిగా దెబ్బ తిడంతో హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే భారీ వాహనాలను పాంగుటూరు నుంచి యర్నగూడెం వైపు మళ్లించారు. దీంతో, ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. యాదవోలు - పాంగుటూరు మధ్య వాన నీటితో చెరువులను తలపిస్తోంది.
- తల్లాడ - దేవరపల్లి రహదారి గోపాలపురం వద్ద పెద్దపెద్ద గుంతలు పడి ధ్వంసమైంది. ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న వారు ప్రమాదాలకు గురవుతున్నారు. మూడేళ్ల క్రితం ఈ రోడ్డును రెండు లేన్లుగా అభివృద్ధి చేశారు.
- గుండుగొలను - కొవ్వూరు హైవే నుంచి బుచ్చియపాలెం వెళ్లే రోడ్డు దారుణంగా మారింది. సుమారు 9 కిలోమీటర్ల మేర ఈ తారు రోడ్డు ప్రస్తుతం మట్టి రోడ్డులా మారింది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. బుచ్చియపాలెం, అచ్చియపాలెం, కోమటికుంట మీదుగా ఈ రోడ్డు గోపాలపురం వెళుతుంది.
- దేవరపల్లి - దుద్దుకూరు మధ్య పెట్రోలు బంకు వద్ద పాత జాతీయ రహదారి పూర్తిగా గుంతలు పడి బురదమయంగా మారింది. భారీ వాహనాలు వెళ్తున్నప్పుడు బురద చిమ్మటంతో రోడ్డుపై వెళుతున్న వారు అసహనానికి గురవుతున్నారు.
- దుద్దుకూరు - పంగిడి మధ్య రోడ్డు పూర్తిగా బురద మయంగా మారింది. ఈ ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా క్వారీలు, క్రషర్లు ఉన్నాయి. దీంతో క్వారీల్లోని మట్టి లారీల టైర్ల ద్వారా రహదారిని కప్పేస్తోంది. చినుకు పడితే చాలు.. ఈ రోడ్డుపై ప్రయాణం సాహసోపేతంగా ఉంటోంది. బైక్‌లు బురద మట్టిలో జర్రున జారి పడిపోతున్నాయి. ఆ ప్రాంతాల్లో నిత్యం ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు.
- ఏలూరు - గుండుగొలను - కొవ్వూరు (ఈజీకే) రోడ్డు నుంచి లక్ష్మీపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా మట్టి రోడ్డుగా మారిపోయింది. సుమారు 50 టన్నుల బరువైన క్వారీ లారీలు తిరగడంతో ఈ రహదారి పూర్తిగా దెబ్బ తింది.
- పెరవలి మండలం కానూరు - నడుపల్లి మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తారు. ఈ రోడ్డు ప్రస్తుతం అడుగో గొయ్యి - గజానికో నుయ్యి అన్న చందంగా మారింది. చినుకు పడితే చాలు.. ఈ రోడ్డులో ఏర్పడిన గోతులు మడుగుల్లా మారిపోతున్నాయి. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం ప్రాణసంకటంలా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. అయినప్పటికీ అధికారులు మాత్రం కన్నెత్తి కూడా చూడటం లేదు. ఈ మార్గంలో నిత్యం ఎవరో ఒకరు పడిపోయి గాయపడటం పరిపాటిగా మారింది. కానూరు వద్ద కల్వర్టు నిర్మించకపోవడంతో నిడదవోలు - నరసాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డులో రాకపోకలు నిలిపివేశారు. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించే వాహనాలను కానూరు - నడుపల్లి మీదుగా మళ్లించారు. ఫలితంగా అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బ తింది. అయినప్పటికీ, ప్రభుత్వం అటు కల్వర్టు నిర్మాణాన్ని, ఇటు రోడ్డు అభివృద్ధిని పట్టించుకోవడం లేదు. పగటి వేళ గోతులు కనిపిస్తున్నా రాత్రి సమయాల్లో ఈ రోడ్డులో రావాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు.

కనీస మరమ్మతులు లేవు



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఇప్పటి వరకూ ప్రధాన రహదారులకు కనీస మరమ్మతులు కూడా లేవు. గోపాలపురం నియోజకవర్గంలోని రహదారులు మరీ దారుణంగా ఉన్నాయి. యర్నగూడెం - పాంగుటూరు రోడ్డుపై పడిన గోతులు చెరువులను తలపిస్తున్నాయి. మెట్ట ప్రాంతంలోని ప్రధాన రహదారులు, గ్రామీణ లింకు రోడ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం వెంటనే చేపట్టాలి.

– గడా జగదీష్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి

రోడ్లపై వెళ్లాలంటే భయమేస్తోంది



మెట్ట ప్రాంతంలోని రోడ్లపై వెళ్లాలంటే భయమేస్తోంది. ఏ రోడ్డు చూసినా గోతుల మయంగా ఉన్నాయి. వర్షాలకు మరింత అధ్వానంగా ఉన్నాయి. పాంగుటూరు – **యాదవోలు మ**ధ్య రోడ్డు పూర్తిగా దెబ్బ **తింది. ఈ రోడ్డుపై ప్ర**యాణం ఇబ్బందికరంగా ఉంది. **దీని నిర్మాణం వెంటనే** చేపట్టి పూర్తి చేయాలి.

– ఎలికె నాగ శ్రీనివాస్, **యాదవోలు**, దేవరపల్లి మండలం

పుంజుకుంటున్న పొగాకు మార్కెట్

- కాస్త పెరిగిన ధర
- కిలోకు గరిష్టంగా రూ.296
- కనిష్టంగా రూ.220



దేవరపల్లి వేలం కేంద్రానికి వచ్చిన పొగాకు బేళ్లు

దేవరపల్లి: పొగాకు మార్కెట్ నెమ్మదిగా పుంజుకుంటోంది. మూడు రోజులుగా ధర స్వల్పంగా పెరుగుతూండటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అంతర్జాతీయంగా మన పొగాకుకు ఎగుమతి ఆర్డర్లు ఖరారు కావడంతో మార్కెట్లో కొనుగోలుదారుల మధ్య పోటీ ఏర్పడినట్టు సమాచారం. పొగాకు కొనుగోళ్లు ప్రారంభించి దాదాపు మూడు నెలలు కాగా, 75 రోజుల పాటు వేలం జరిగింది. దాదాపు 72 రోజుల పాటు ధరలు నిలకడగా కొనసాగడంతో రైతులు దిగులు చెందారు. ముఖ్యంగా కౌలు రైతులు పెట్టుబడి వచ్చే పరిస్థితి కూడా లేకపోవడంతో ఆందోళన చెందారు. ఈ పరిస్థితుల్లో మూడు రోజులుగా మార్కెట్లో ధరలు స్వల్పంగా పెరుగుతూ వస్తున్నాయి. ఈ నెల 23న కిలో గరిష్ట ధర రూ.290 ఉండగా, 24న రూ.291, 25న రూ.293కు పెరిగి, గురువారం రూ.296కు చేరింది. దీంతో పాటు కొనుగోళ్లలో పురోగతి కనిపించడంతో ముందు ముందు మార్కెట్ ఆశాజనకంగా ఉండవచ్చునని రైతులు భావిస్తున్నారు. మూడు రోజుల్లో కిలోకు గరిష్టంగా రూ.6 పెరుగుదల కనిపించింది. ఎక్స్ గ్రేడ్ పొగాకు కొనుగోలుకు ట్రేడర్లు పోటీ పడటంతో ధరలో పెరుగుదల వచ్చిందని అధికారులు అంటున్నారు. లో గ్రేడ్, మీడియం గ్రేడ్ పొగాకు కొనుగోలుకు ట్రేడర్లు ఆసక్తి చూపకపోవడంతో ఆయా గ్రేడ్‌ల పొగాకు నిల్వలు రైతుల వద్దనే ఉన్నాయి. పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని దేవరపల్లి, జంగారెడ్డిగూడెం-1, 2, కొయ్యలగూడెం, గోపాలపురం వేలం కేంద్రాల నుంచి గురువారం 3,983 బేళ్లు వేలానికి రాగా, ట్రేడర్లు 2,681 బేళ్లు కొనుగోలు చేశారు. 1,302 బేళ్లను తిరస్కరించారు. 3,40,934 కిలోల పొగాకు విక్రయం జరిగింది. ధర స్వల్పంగా పెరిగినప్పటికీ వేలం కేంద్రాలకు వచ్చిన బేళ్లు తక్కువగానే ఉన్నాయి. మంగళవారం 6,560, బుధవారం 5,516 చొప్పున బేళ్లు వేలానికి వచ్చాయి. గురువారం ఆ సంఖ్య 3,983గా ఉందని అధికారులు తెలిపారు. వేలానికి వస్తున్న బేళ్లలో 40 శాతం అమ్ముడవక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ట్రేడర్లు కొనుగోలు చేయకపోవడంతో తీసుకు వచ్చిన బేళ్లు తిరిగి ఇంటికి తీసుకు వెళ్లడానికి నానా అవస్థలూ పడుతున్నారు. బేలుకు దూరాన్ని బట్టి సుమారు రూ.200 నుంచి రూ.300 వరకూ రవాణా ఖర్చు అవుతోందని వాపోతున్నారు. ధర స్వల్పంగా పెరుగుతున్నప్పటికీ అక్కడక్కడ కొన్ని బేళ్లకు మాత్రమే ఈ రేటు వస్తోందని రైతులు తెలిపారు.

వేలం కేంద్రాల వారీగా కిలో పొగాకు ధరలు (రూ.)

వేలం కేంద్రం	గరిష్ట	సగటు
దేవరపల్లి	295.00	250.00
జంగారెడ్డిగూడెం-1	295.00	281.00
జంగారెడ్డిగూడెం-2	296.00	273.00
కొయ్యలగూడెం	296.00	268.00
గోపాలపురం	294.00	268.00

హుండీ ఆదాయం రూ.4.33 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి వారికి రూ.4,33,554 ఆదాయం వచ్చింది. ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాల్లోని హుండీలను గురువారం అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో తెరిచి ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ హుండీల ద్వారా రూ.4,19,717, అన్నదాన హుండీ ద్వారా రూ.13,837 కలిపి 43 రోజులకు మొత్తం రూ.4,33,554 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ తనిఖీదారు జి.సత్యవర ప్రసాద్ సమక్షంలో ఆదాయం లెక్కింపు నిర్వహించారు.

దేవుని భూములపై స్కెచ్!

- టీడీపీ ప్రజాప్రతినిధి అనుచరుడికే దక్కేలా ప్లాన్
- వేలంలో చక్రం తిప్పిన అధికార పార్టీ నాయకులు



వేలం నిర్వహిస్తున్న ఆర్‌జేసీ త్రినాథరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: అధికారం అండతో టీడీపీ నాయకులు ఏకంగా దేవుడి ఆదాయానికే టెండర్ పెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. రాజమహేంద్రవరం శ్రీ ఉమా కోటిలింగేశ్వరస్వామి, శ్రీ సీతారామస్వామి దేవస్థానానికి బొమ్మూరులోని సర్వే నంబర్ ఎల్‌పీ నంబర్-65లో 6.15 ఎకరాల భూమి ఉంది. అందులో నాలుగెకరాలను కమర్షియల్ విధానంలో నాలుగు బిట్లుగా విభజించి బహిరంగ వేలం వేస్తున్నట్లు దేవదాయ శాఖ అధికారులు ఇటీవల ప్రకటించారు. ఈ మేరకు బొమ్మూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ వి.త్రినాథరావు, డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్ సుబ్బారావు సమక్షంలో గురువారం వేలం నిర్వహించారు. ముందుగా డీడీలు తీసిన వారే వేలంలో పాల్గొనాలని నిర్ణయించారు. జాతీయ రహదారికి చేరువన ఉన్న ఈ భూమిపై కన్ను వేసిన అధికార పార్టీ నాయకులు చక్రం తిప్పారు. తమ వారి పేర్లతోనే నాలుగు టెండర్లు దాఖలు చేశారు. వాస్తవానికి నాలుగు బిట్లుగా వేలం ప్రక్రియ చేపట్టడంతో ప్రతి బిట్‌కు ప్రత్యేకంగా డీడీ తీయాల్సి ఉంటుంది. కానీ, అధికార పార్టీ కనుసన్నల్లో ఈ వేలం జరగడంతో కేవలం ఒకే ఒక్క డీడీతో నాలుగు బిట్లకు పాల్గొనే వెసులుబాటు కల్పించారు. అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి ప్రధాన అనుచరుడు స్వయంగా ఈ వేలంలో పాల్గొనడంతో ఇతరులెవ్వరూ పాల్గొనకుండా కట్టడి చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. నాలుగు బిట్లకు నెలకు రూ.3,24,000, జీఎస్టీతో కలిపి రూ.3,82,320 చొప్పున చెల్లించే విధంగా పాట దక్కించుకున్నారు. పదకొండేళ్ల లీజు కాలానికి గాను ప్రతి నెలా రూ.3,82,320తో పాటు మూడేళ్లకోసారి 30 శాతం పెంచే విధంగా ఒప్పందం జరిగింది. ఈ భూములను దేనికి వినియోగించాలనేది అధికారులు చెప్పలేదు. జాతీయ రహదారి సమీపాన ప్రత్యేకమైన రోడ్డు కలిగిన ఈ భూముల్లో షెడ్లు నిర్మించి, ఉల్లిపాయలు నిల్వ చేసుకునేందుకు నిర్ణయించారని సమాచారం. అయితే, విస్తృత ప్రచారం చేసి, ఈ భూములకు బహిరంగ వేలం నిర్వహిస్తే దేవదాయ శాఖకు మరింత ఆదాయం చేకూరేదని పలువురు అంటున్నారు.

ఖరీఫ్ ముగిశాకే..

- పంపా బ్యారేజీకి కొత్త గేట్ల ఏర్పాటులో జాప్యం
- ప్రస్తుతం 4వ నంబర్ గేటుకు తాత్కాలిక మరమ్మతులు
- 87.5 అడుగులకు చేరిన నీటిమట్టం



అన్నవరం: పంపా రిజర్వాయర్‌కు కొత్త గేట్ల ఏర్పాటు పనులు మరింత జాప్యం కానున్నాయి. ఇప్పటికే ఈ పనులు పూర్తి చేయాల్సి ఉండగా పలు కారణాలతో ఆలస్యం చోటు చేసుకుంది. ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లోని 12,500 ఎకరాలకు పంపా రిజర్వాయర్ నుంచి సాగు నీరు అందిస్తారు. దీంతో పాటు అన్నవరం దేవస్థానానికి, గ్రామానికి కూడా నీరు అందిస్తారు. పంపా జలాశయం గేట్ల నిర్వహణ చాలా కాలం నుంచే ఇబ్బందికరంగా మారింది. వరద నీరు సముద్రంలోకి వదిలే సమయంలో గేట్లు ఎత్తేందుకు, నీటిమట్టం తగ్గినపుడు ఎత్తిన గేట్లు దించేందుకు చాలా సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ కొత్త గేట్లు అమర్చాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2023 జూలైలో రూ.3.36 కోట్లతో అంచనాలు రూపొందించి, నిధులు కేటాయించారు. గత ఏడాది మార్చి నుంచి సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నిధులు విడుదల కాలేదు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో నిధులు విడుదల చేసింది. కొత్త గేట్ల ఏర్పాటుకు మూడుసార్లు టెండర్లు పిలిచారు. కానీ, ఎవ్వరూ రాలేదు. చివరిగా ఏప్రిల్‌లో షార్ట్ టెండర్ పిలవగా తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన గోపాలకృష్ణ ఏజెన్సీ 4.75 శాతం ఎక్కువకు టెండర్ దక్కించుకుంది. ఇదే సమయంలో వర్షాలు మొదలైపోవడంతో పనుల్లో మళ్లీ జాప్యం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో రిజర్వాయర్‌కు ఉన్న ఐదు గేట్లలో అత్యంత సమస్యాత్మకంగా ఉన్న 4వ నంబర్ గేటుకు మాత్రమే ప్రస్తుతం మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. మిగిలిన నాలుగు గేట్లకు తాత్కాలిక మరమ్మతులు చేస్తారు. ఖరీఫ్ అనంతరం ఐదు గేట్లు కొత్తవి అమర్చుతారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంపా జలాశయంలోకి పెద్ద మొత్తంలో నీరు వచ్చి చేరుతోంది. నీటిమట్టం గురువారం సాయంత్రానికి 87.5 అడుగులకు చేరింది. ఇంకా ఇన్‌ఫ్లో వస్తున్న నేపథ్యంలో వారం రోజుల్లోగా 4వ నంబర్ గేటు మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. గేట్లకు మరమ్మతులు, కొత్త గేట్ల ఏర్పాటుపై పది రోజుల క్రితమే అధికారులతో కలిసి నిపుణుడు సారథి పరిశీలించారు. అలాగే, ఈఈ శేషగిరిరావు, ఇతర అధికారులు, గేట్ల మరమ్మతులు చేసే కాంట్రాక్టర్ సిబ్బంది బుధవారం పరిశీలన జరిపారు.

నేడు వైఎస్సార్ సీపీ జిల్లా సమావేశం

- కాతేరులో నిర్వహణ
- ఏర్పాట్లను పరిశీలించిన నేతలు

రాజమహేంద్రవరం రూరల్: 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు కాతేరులోని వెంకటాద్రి గార్డెన్స్‌లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్ సీపీ జిల్లా సమావేశం నిర్వహిస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఈ విషయం తెలిపారు. వెంకటాద్రి గార్డెన్స్‌లో ఈ సమావేశం ఏర్పాట్లను ఆయన, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి, పార్టీ నేతలతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ, ఈ సమావేశంలో పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు తిప్పల గురుమూర్తిరెడ్డి, పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు హాజరవుతారని తెలిపారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని వేణు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎంఎం ఆలీ, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి అంగాడి సత్యప్రియ, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, పార్టీ జిల్లా కోశాధికారి యెజ్జు వాసు, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఆచంట కల్యాణ్, మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం పాల్గొన్నారు.



వెంకటాద్రి గార్డెన్స్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి వేణు తదితరులు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎదురెదురుగా వాహనాలు ఢీకొని ఘటన



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముత్యాలు

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట వద్ద రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై టి.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు అన్నదేవరపేటకు చెందిన కొయ్య ముత్యాలు (38) ఠాగూర్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. గురువారం ఉదయం పని ముగించుకుని తన స్కూటీపై ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఎస్కే సుధీర్ తాళ్లపూడి నుంచి అన్నదేవరపేట వస్తూ అన్నదేవరపేట సొసైటీ వద్ద పరస్పరం ఢీకొన్నారు. ఈ ఘటనలో ముత్యాలు తీవ్రంగా గాయపడి సంఘటనా ప్రదేశంలో మృతి చెందాడు. గాయాల పాలైన సుధీర్‌ను 108లో గోపాలపురం ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

యువకుడికి నివాళి



మృత దేహానికి నివాళులర్పిస్తున్న తలారి వెంకట్రావు

ముత్యాలు కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి వెంకట్రావు, నాయకులు పిట్టా శ్రీనివాస్ పరామర్శించారు. సంతాపం తెలియజేశారు.



మత్స్య సంపదతో ఉప్పాడ హార్బర్‌కు చేరుకున్న బోట్లు



వలల నుంచి మత్స్య సంపదను తీస్తున్న మత్స్యకారులు



చేపలకు వేలంపాట నిర్వహిస్తున్న వ్యాపారులు



ఇతర రాష్ట్రాలకు చేపలను ఎగుమతి చేస్తున్న వ్యాపారులు

జలపుష్ప విలాసం!

- చేపల విక్రయాలతో ఉప్పాడ తీరం కళకళ
- సుమారు రూ.90 లక్షల మేర వ్యాపారం

ఉప్పాడ మేజర్ హార్బర్, అమీనాబాద్ సాగరతీరం చేపల క్రయ విక్రయాలతో గురువారం కళకళలాడాయి. మత్స్యకారులకు కాకి కవళ్లతో పాటు పలు రకాల చేపలు చిక్కాయి. ఉప్పాడ, అమీనాబాద్, మూలపేట గ్రామాలకు చెందిన సుమారు 80 బోట్లపై మత్స్యకారులు వేటకు వెళ్లారు. ఈ ఒక్కరోజే మత్స్యకారులకు ఒక్కో బోటుకు 2 నుంచి 3టన్నుల వరకూ మత్స్య సంపద(కాజా గొరస) చిక్కింది. సుమారు రూ.90 లక్షల విలువైన సుమారు 90 టన్నుల చేపలు లభ్యమైనట్టు మత్స్యకారులు చెబుతున్నారు. మత్స్య సంపదను కేరళ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

– కొత్తపల్లి

విధి నిర్వహణలో విగతజీవులై..

- రోడ్డు ప్రమాదంలో ఎస్సై, కానిస్టేబుల్ మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- గంజాయి రవాణా నిందితుడి అన్వేషణలో దుర్ఘటన

ఆలమూరు/కోదాడ రూరల్: కర్తవ్య నిర్వహణే ప్రథమ ధర్మం అంటారు. ఆ కర్తవ్య నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం ఆ కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. విధి నిర్వహణలో క్షణం తీరిక లేకుండా ఉండే ఆ ఉద్యోగులు శాశ్వత విశ్రాంతిని పొందారు. మాదక ద్రవ్యాల (గంజాయి) రవాణా చేస్తున్న నిందితుడిని పట్టుకోవడానికి వెళుతూ అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ దినోత్సవం రోజునే ఓ ఎస్సై, ఓ కానిస్టేబుల్ అసువులు బాసారు.

వివరాల్లోకి వెళితే.. ఆలమూరు మండల పరిధిలోని 216 ఏ జాతీయ రహదారిలో గతంలో గంజాయి అక్రమ రవాణా కేసు నమోదైంది. ఆ కేసులో నిందితుల్లో ఒకరు హైదరాబాద్‌లో ఉన్నాడన్న సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక ట్రాక్‌ను సొంతం చేసుకున్న ఎస్సై అశోక్ బుధవారం రాత్రి పది గంటలకు ఆత్రేయపురం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎస్.బ్లెసన్ జీవన్, రావులపాలెం సీఐ కార్యాలయం ఐడీ పార్టీ హెడ్ కానిస్టేబుల్ దొంగ స్వామితో కలిసి నిందితున్ని అరెస్ట్ చేసేందుకు డ్రైవర్ జి.రమేష్‌ను వెంటబెట్టుకుని ఎర్టిగా కారులో హైదరాబాద్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో డ్రైవర్ తనకు నిద్రవస్తోందని చెప్పడంతో అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద ఏపీ వైపు గంటన్నర పాటు కారు పక్కకు ఆపి నిద్రించారు.

బయల్దేరిన 10 నిమిషాలకే..

కొద్దిసేపటి తర్వాత వీరు తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరగా.. ఆ తర్వాత పది నిమిషాలకే కోదాడ పట్టణ పరిధిలోని దుర్గాపురం జంక్షన్‌లో రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారుతో ఢీకొట్టారు. కోదాడ పట్టణ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ప్రమాదంలో ఎస్సై అశోక్ (45) కానిస్టేబుల్ బ్లెసన్ (32) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. అందులో ప్రయాణిస్తున్న డ్రైవర్ రమేష్, హెడ్ కానిస్టేబుల్ స్వామి తీవ్ర గాయాలతో బయట పడ్డారు. విధి నిర్వహణలో రాజీ పడకుండా, అక్రమార్కులకు సింహస్వప్నంగా, రక్షణ కోసం వచ్చిన వారికి ఆపద్బాంధవుడిగా పేరు తెచ్చుకున్న అశోక్ మృతితో అంతటా విషాదం అలముకుంది.



కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్సై అశోక్‌ను బయటకు తీస్తున్న పోలీసులు



ఆలమూరులో బ్లెసన్ మృతదేహాన్ని తిలకించేందుకు భారీగా చేరుకున్న ప్రజానీకం

కారులో ఇరుక్కుపోయిన ఎస్‌ఐ మృతదేహం

లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారు ముందు భాగంలో కూర్చున్న ఎస్‌ఐ మృతదేహం అందులో ఇరుక్కుపోయింది. కోదాడ పోలీసులు కారు భాగాలను తొలగించి అతికష్టం మీద ఆయన మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ఘటన తర్వాత లారీతో సహా డ్రైవర్ పరారయ్యాడు. అయితే పోలీసులు లారీని పట్టుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

కోనసీమ ఏఎస్పీ, కోదాడ డీఎస్పీ నివాళులు

కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో ఎస్‌ఐ, కానిస్టేబుల్ మృతదేహాలకు కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి నివాళులర్పించారు. అనంతరం మృతదేహాలను ఏపీ పోలీసులకు అప్పగించారు. క్షతగాత్రుడు హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కోదాడ పట్టణ సీఐ శివశంకర్ తెలిపారు.



నరసాపురంలో అశోక్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పదోన్నతి వస్తుందనుకునే లోపే..

ఎస్సై అశోక్‌కు ఈ ఏడాది సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి వస్తుందని కుటుంబ సభ్యులు భావిస్తున్న నేపథ్యంలో ఇంతటి ఘోరం జరగడం వారిని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే ఉన్నతాధికారుల సాయంతో అనేక కేసులను ఛేదించి పలు అవార్డులు, రివార్డులను సొంతం చేసుకున్నారు.

అశోక్ స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలోని రుస్తుంబాదా కాగా ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని ఏవీ అప్పారావు రోడ్డులో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు సోదరులు, ఒక సోదరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. నరసాపురంలోని అశోక్ నివాసంలో మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

విధి నిర్వహణలో ఎస్సై అశోక్‌కు తోడుగా వెళ్లి మృత్యు ఒడిలోకి వెళ్లిన కానిస్టేబుల్ బ్లెసన్ స్వస్థలం ఆలమూరు. ఆయన తన తల్లి హెప్సీబా, సోదరులు ప్రిన్స్ ఆదిత్య, అలెక్స్ కలసి ఉంటున్నారు. కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన బ్లెసన్ తమ కుటుంబానికి అండగా ఉంటాడనుకుంటే హఠాత్తుగా మృతి చెందడంపై కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. వచ్చే ఏడాది కొత్త ఇల్లు నిర్మించుకుని పెళ్లి చేసుకుందామనుకుంటున్న తన సోదరుడు బ్లెసన్ ఆ ముచ్చట తీరకుండానే కానరాని లోకాలు వెళ్లిపోయాడని సోదరులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. బ్లెసన్ మృతి పట్ల పలువురు ప్రముఖులు తమ సంతాపాన్ని తెలియజేశారు.

ప్రేయసి లేని జీవితం వద్దని!

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య



విజయ్‌కుమార్ (ఫైల్)

పిఠాపురం: ప్రేమించిన యువతి చనిపోయింది. ఆమె లేని జీవితం వద్దనుకుని ఆ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చివరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గొల్లప్రోలు పోలీసులు తెలిపిన కథనం మేరకు మండలంలోని దుర్గాడ జగనన్న కాలనీకి చెందిన ములగపాటి నాగమణికి ఇద్దరు కుమారులు. వారిలో పెద్ద కుమారుడు సురేష్ అరబిందో కంపెనీలో టాంకర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. రెండో కుమారుడు విజయ్ కుమార్ (24) కాకినాడ ఆర్టీసీలో కాంట్రాక్ట్ పద్ధతిపై డ్రైవర్‌గా పనిచేసి, మానేసి ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నాడు. తాను ప్రేమించిన యువతి చనిపోయిందని తానూ చనిపోవాలనుకుంటున్నట్టు కొంతకాలంగా విజయ్‌కుమార్ తల్లితో చెప్పేవాడు. ఎవరి కోసమో నువ్వెందుకు చనిపోవడం మేమందరం ఉన్నాం కదా అని తల్లి ధైర్యం చెప్పేది. ఈ నేపథ్యంలో ఈనెల 24వ తేదీ సాయంత్రం విజయ్ కుమార్ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడు వాంతులు చేసుకోవడం చూసిన స్థానికులు అతని అన్న సురేష్‌కు సమాచారం ఇచ్చారు. అతడు వెంటనే వచ్చి అంబులెన్స్‌లో పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేసున్నారు.

ఇంటర్నేషనల్ రోబోటిక్స్ పోటీల్లో ప్రతిభ



రోబోటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రోబోరోర్ మలేషియా-25 వెఫా రోబోటిక్ నిర్వహించిన ఇంటర్నేషనల్ రోబోటిక్స్ పోటీల్లో కాకినాడ లక్ష్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. స్మోర్ఫీ ఇమాజినరీలో ప్రథమ, తృతీయ స్థానాలు, స్మోర్ఫీ పైలట్ విభాగంలో రెండు రజత పతకాలు, కాంస్య పతకం సాధించారు. స్మోర్ఫీ స్క్వేర్ అటానమస్ విభాగంలో రెండు స్వర్ణం, రజక పతకం సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. టీమ్ వన్‌లో రిహాన్‌సనా, లలిత్ కుమార్‌వర్మ, సాజిత్, ఆదిత్య ఆనంద్, ఎ.వీనిత్‌లు పాల్గొనగా టీమ్-2లో డి.మనోహర్‌రెడ్డి, దుర్గాఆదిత్య శశాంక్, ముకుంద, నాగసాయి అభినవ్, ఎస్.అర్జున్ పాల్గొన్నారు. స్కూల్ డైరెక్టర్ సుగుణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు రోబోటిక్స్ ఒక ప్రత్యేక సబ్జెక్టుగా నేర్పిస్తున్నామన్నారు. ఆదిత్య విద్యాసంస్థల అధినేత శేషారెడ్డి మాట్లాడుతూ పలు దేశాలు పాల్గొన్న పోటీల్లో ఇండియా నుంచి తమ స్కూల్ విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల బృందాన్ని ప్రిన్సిపాల్ వందన బోహ్రా, ఉపాధ్యాయులు అభినందించారు.

డీసీసీబీ ఇన్‌చార్జి సీఈఓగా ప్రవీణ్‌కుమార్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ ఇన్‌చార్జి సీఈఓగా ప్రవీణ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ సీఈఓగా పనిచేసిన ఆర్‌వీ నరసింహారావు నియామకం చెల్లుబాటు కాదని రిజర్వుబ్యాంకు చెప్పడంతో ఆయన రాజీనామా చేశారు. మూడు సంవత్సరాల క్రితం ఆయన డీసీసీబీ సీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. 2024 డిసెంబర్ 31న ఆయన పదవీ కాలం ముగియడంతో ఆయనకు ఒక సంవత్సరం పాటు సీఈఓగా పొడగింపు ఇవ్వాలని ఏపీ కో- ఆపరేటివ్ బ్యాంకుకు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా లేఖ రాయడంతో ఆప్కాబ్ దానికి అంగీకరించింది. గత ఆరు నెలలుగా ఆయన సీఈఓగా కొనసాగుతున్నారు. ఎటువంటి ఇంటర్వ్యూలు లేకుండా డీసీసీబీ సీఈఓగా నియామకం చెల్లదంటూ రిజర్వుబ్యాంకు చెప్పడంతో ఆయన తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.



అడ్మిషన్లు లేని కళాశాలలకు నోటీసులు

- 25 శాతం కంటే తక్కువ ఉంటే చర్యలు
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నత
- విద్యామండలి చైర్మన్ మధుమూర్తి ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఆచార్య మధుమూర్తి

రాజానగరం: గత మూడు సంవత్సరాలుగా 25 శాతం కంటే తక్కువ అడ్మిషన్లతో నడుస్తున్న డిగ్రీ కళాశాలలను గుర్తించి, వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల ఉప కులపతులు, రిజిస్ట్రార్‌లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆదేశాలిచ్చారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి కూడా పాల్గొన్నారు. ఉన్నత విద్యకు సంబంధించిన పలు అంశాలపై ఈ కాన్ఫరెన్స్‌లో చర్చించారు. కళాశాలల యాజమాన్యాలు అనుబంధ యూనివర్సిటీలకు చెల్లించే కామన్ సర్వీసు ఫీజుల గురించి ఆరా తీశారు. అపార్ ఐడీలను మరింత వేగవంతం చేయాలని సూచించారు. 2024-25, 2025-26 సంవత్సరాలలో ఏపీ రీసెర్చ్ సెట్ నిర్వహణకు సంబంధించిన అంశాలపై కూడా చర్చించారని వీసీ ప్రసన్నశ్రీ తెలిపారు.

అడుగుకో గుండం!



భారీ గోతులతో అప్పనపల్లి ఆర్ అండ్ బీ రహదారి

మామిడికుదురు: ప్రతిపక్షంలో ఉండగా కూటమి నేతలు రోడ్ల అధ్వాన స్థితిపై ఎన్నో విమర్శలు చేశారు. ధర్నాలు, రాస్తారోకోలు చేసి నిరసనలు తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఏమాత్రం మార్పు లేదని స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రంఅప్పనపల్లి ఆర్ అండ్ బీ రహదారి దుస్థితిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాశర్లపూడి కరకట్ట దిగువ నుంచి అప్పనపల్లి వైపు కొంత భాగం, అక్కడి నుంచి బి.దొడ్డవరం, పెదపట్నంలంక వరకు ఉన్న ఆర్ అండ్ బీ రహదారిపై ప్రయాణించడం పాదచారులు, వాహన చోదకులకు సవాలుగా మారింది. వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయమని వాపోతున్నారు. కనీస మరమ్మతులు కూడా చేపట్టకుండా నిర్లక్ష్యం చూపుతున్నారని మండిపడుతున్నారు.

శుభకార్యాలకు శూన్యం!

- ఆషాఢానికి ఎన్నో ప్రత్యేకతలు
- వర్షాలతో సాగుపనులకు శ్రీకారం
- వైష్ణవ ఆరాధనలకు ప్రాశస్త్యం



గోరింటాకుతో ఆరోగ్యం



కొత్తపేట విజయకనకదుర్గాదేవి (ఫైల్)

కొత్తపేట: తెలుగు మాసాల్లో ఒక్కో దానికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ప్రస్తుతం నడుస్తున్నది ఆషాడం. హిందూ పురాణాల ప్రకారం ఈ మాసానికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. పాటించాల్సిన నియమాలు ఎన్నో ఉన్నాయి. గురువారం నుంచి ప్రారంభమై వచ్చే నెల 24తో ఈ నెల ముగుస్తుంది. ఈ మాసాన్ని శూన్యమాసం అంటారు. వివాహాది శుభకార్యాలు ఏమీ ఈ నెలలో తలపెట్టరు. ఈ మాసంలో అనేక పర్వదినాలున్నాయి. ఆషాడ శుద్ధ ఏకాదశి వైష్ణవ ఆరాధనలకు ముఖ్యమైంది. దీనినే తొలి ఏకాదశి అని అంటారు. అప్పటి నుంచి ప్రతి వారం ఏదో ఒక పండుగ, వ్రతం, పూజలు నిర్వహిస్తారు. ఈ నెలలోనే గురు పూర్ణిమ, దేవశయన ఏకాదశి, వారాహి నవరాత్రి పూజలు ఈ మాసం తొలిరోజు నుంచే ప్రారంభమవుతాయి. తెలంగాణలో బోనాల ఉత్సవాలు, ఒడిశా రాష్ట్రం పూరీలో జగన్నాథుని రథయాత్ర వంటి ముఖ్యమైన కార్యక్రమాలు, ఉపవాస పండుగలు నిర్వహిస్తారు. చాతుర్మాసోత్సవాలు సైతం ఈ నెలలోనే ప్రారంభమౌతాయి. పురాణాల ప్రకారం శ్రీమహావిష్ణువు విశ్రాంతి తీసుకుంటాడని, అందుకే ఈ కాలంలో శుభకార్యాలు చేయడాన్ని నిషేధించారని చెబుతారు. అయితే విష్ణుమూర్తిని పూజించడం, మంత్రాలను జపించడం శుభప్రదంగా పరిగణిస్తారు. దుర్గామాత ఆరాధన శక్తినిస్తుందని చెబుతారు. ఈ మాసంలో దుర్గాదేవిని శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దానధర్మాలకు ప్రాధాన్యం గల మాసమని, దానధర్మాలు చేయడం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుందంటారు. ఆషాఢ అమావాస్య రోజున పూర్వీకులను స్మరించుకుంటూ శ్రాద్ధ కర్మలు, తర్పణాలు నిర్వహించడం ద్వారా వారి అనుగ్రహం లభిస్తుందంటారు.

గోరింటాకు ప్రత్యేకం

ఈ కాలంలో గ్రామీణులు గోరింటాకు పెట్టుకుంటారు. దీనితో సైన్స్ ముడిపడి ఉంది. వర్షాలు కురవడం వల్ల క్రిమికీటకాలు పెరిగి అంటువ్యాధులు ప్రబలుతాయి. చర్మవ్యాధుల నివారణకు చేతులు, కాళ్లకు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ముఖ్యంగా బాలికలు, యువతులు, మహిళలు ఎక్కువగా గోరింటాకు అలంకరణగా భావిస్తారు. పెళ్లి ఈడుకొచ్చిన యువతులకు బాగా పండితే మంచి మొగుడు వస్తాడని అంటారు.

వధూవరులకు తప్పని విరహం

ముఖ్యంగా ఆషాఢమాసం అనగానే గుర్తుకువచ్చేది కొత్తగా పెళ్లైన దంపతులు కలవకూడదనే ఆచారం . ఇది పూర్వం నుంచీ వస్తోంది. దీనిలో భాగంగా అమ్మాయిని పుట్టింటికి తీసుకువెళతారు. దీని వెనుక శాస్త్రీయ కారణాలు ఉన్నాయని పెద్దలు, పండితులు చెబుతారు. అత్త, మామలు దాటిన గుమ్మం అల్లుడు దాటకూడదని, అత్తా, కోడలు ఒక ఇంటిలో ఉండకూడదని రకరకాల కథనాలతో పాటు ఈ మాసం నుంచే వర్షాకాలం ప్రారంభమౌతుంది. రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టి పనులు ప్రారంభిస్తారు. కొత్తగా పెళ్లైన యువకుడు వ్యవసాయ పనులకు దుమ్మా కొట్టి అత్తవారింట్లోనే గడుపుతాడు.. ఇక్కడ పనులు సాగవనే కారణంతో ఈ నెల రోజులు నూతన దంపతులు కలవకూడదనే నియమం పెట్టారంటారు.